# ఆత్మాహుతి

పరంజ్యోతీ నర్సింగ్ హోములో మంచమ్మీద పడుకున్న విలాసినీ మోహన్ దాస్ కళ్లు తెరిచింది.

"మేడమ్ మెలకువ వచ్చిందా ? ఒకకప్పు హార్లిక్సు తీసుకోండి'' నర్సును పిలిచి కప్పుతో హార్లిక్సుతెచ్చి తాగించమని చెప్పాడు డాక్టరుసింహ.

ఆమె అయోమయంగా గదంతా కలయజూస్తోంది.

నర్సు వేడివేడి హార్లిక్సు తీసుకువచ్చి ఆమెచేత తాగించింది.

''మేడమ్, మీరిక్కడే గంటసేపు రెస్టుతీసుకుని తరువాత మీ గదిలోకి వెళ్ళండి. హార్లిక్సు తాగిన తరువాత గిడ్డీనెస్ తగ్గిపోతుంది. నేను ఆఫీసు గదిలో ఉంటాను. ఏదయినా కావాలంటే నర్సుచేత చెప్పిపంపండి'' డాక్టరు తన గదిలోకి వెళ్లాడు.

హార్లిక్సుతో కొంచెం తేరుకున్న విలాసినీదాస్ ''నాకు విశ్రాంతా ? దేహానికా-లేక మనసుకా ?'' అనుకుంది.

కన్నీటి కాలవలు కణతలగుండా జారి తలవెంట్రుకలను తడుపుతున్నాయి.

ఇవాళ నర్సింగ్ హోములో ఎటువంటిమాటలు విన్నది? అసలు-తనుగదిలో ఉంటే సరిపోయేది. ఆఫీసురూమ్‌కి వెళ్ళి డాక్టరుకేదో చెప్పాలనుకుంది. తను గదిలోకి రాగానే, పన్నెండేళ్ల తనబాబు-శ్రీరామ్ నల్లటి ఉంగరాలజుట్టు మధ్య చందమామలాంటి ముఖం-అపురూప శిల్పంలా ఆ ముక్కు-ఎర్రటి పెదవులతో-ముడుచుకున్న మొగ్గలా చిన్ననోరు. దృష్టి తగలకుండా పెట్టిన చుక్కలా గడ్డంమీద ఓ పుట్టుమచ్చ-నిద్రలో ఉన్నాడు. అతడిని కళ్ళనిండా చూసుకుని సుతారంగా నుదిటిమీద ముద్దుపెట్టుకుంది.

తనకు జీవితంలో మిగిలింది ఈ బాబే అపురూప శిల్పంలా.

బరువుగా నిట్టూర్చి వెనక్కు తిరిగిచూస్తూ ముందుకు అడుగులువేస్తూ ఆఫీసుగది ముందరికివచ్చి టక్కున ఆగిపోయింది.

ఆఫీసురూంలో డాక్టరుతో ఎవరో మాట్లాడుతున్నారు.

''పిల్లవాడు చాలా తెలివిగలవాడు. గ్రహణశక్తి అద్భుతంగా ఉంది. వయసుకు మించిన విజ్ఞానాన్ని ఇప్పటికే చాలా ఆర్జించాడు. వాడికే కళ్లుంటే ఎన్ని డిగ్రీలు సంపాదించేవాడో ? మీరు ఈ ఒక్క సహాయం చెయ్యండి డాక్టర్ డబ్బుకు వెనుదీయను. మా అయిదు కుటుంబాలకు వీడొక్కడే మగబిడ్డ. మా వ్యాపారానికంతకూ వీడొక్కడే వారసుడు" డాక్టరు కాళ్లమీదపడినంత పనిచేస్తు న్నాడు ఆయన.

"ఇక్కడున్న కేసులన్నీ ఇట్లాగేఉన్నాయి. ఒక రోగికి కిడ్నీ చెడి పోయింది. అభివృద్ధిలోకి రావలసిన యువకుడు. అతడి జీవితమంతా ముందు న్నది. అతడి భవిష్యత్తు బాగుపడాలంటే ఒకకిడ్నీ ఎవరయినా దానంచేయాలి. మా దగ్గర ఉండవుకదా బ్యాంకులో. ఎవరు ముందుకువస్తారు చెప్పండి. వాళ్ల ప్రాణంమీదికి తెచ్చుకుని ఇటువంటి విరాళం ఎవరుచేస్తారు ? చనిపోయినవాళ్ల వయితే గంటలోపల పనికొస్తాయి. కొనుక్కోవచ్చు. కింద అంతస్తులో ఒక నడి వయసులో ఉన్న యువకుడు గుండెజబ్బుతో బాధపడుతున్నాడు. పిల్లలతండ్రి. పిల్లలు నలుగురు పదిహేనేళ్ళలోపు వయసు గలవాళ్ళు. ఇతడు చనిపోతే ఆ సంసారానికి దిక్కు లేదు. ఈ రోజుల్లో గుండెకూడా మార్పిడి చేయవచ్చు. కాని ప్రాణం ఉండగా ఎవరూ ఇవ్వటానికి ఒప్పుకోరు. అమర్చటానికి విదేశాలనుంచి నిపుణులు వస్తారు. కాని ఇచ్చేదెవరు ?''

"తమకు చావు సమీపంలో ఉన్నదనగా వాటిని ఇచ్చేదాతలు ఉంటే వీళ్ల జీవితాలు బాగుపడతాయి. దాతలకాదృష్టి ఉండాలి''

"ఉండదు. ఒక పన్నెండేళ్ల పిల్లవాడు మా దగ్గరఉన్నాడు. పిల్లవాడి తండ్రి ఈ నర్సింగ్‌హోము కట్టించాడు. ఆ పిల్లవాడికి ప్రాణంఉంది కాని లేని దానితో సమానం. దేహంలో అవయవాలు అన్నీ బాగా ఉన్నాయి. మెదడు పని చేయదు. యంత్రంలా గుండె కొట్టుకుంటుంది. రక్తప్రసారం ఉంది. కళ్లతో

చూస్తాడు కాని ఆ చూపుకు అర్థంలేదు. ప్రాణంఉన్నది కనుక వేళకు-ఆహారం ఇస్తారు. పోయినంత లోపలికి పోతుంది. అతడు ఎన్నేళ్ళున్నా అంతే. అట్లా అని తెలిసినా వాళ్ళు ఏ అవయవమైనా డొనేట్ చేస్తారా ? చెయ్యరు. ప్రయోజనంలేని బ్రతుకని డాక్టర్లు మాత్రం ప్రాణాలుతీసి ఆ అవయవాలను మరొకరికి అమరుస్తారా ? ఇది ఒకవిధంగా మెడికల్ ఎథిక్సుకు విరుద్ధం. అంటే వైద్యశాస్త్ర విరుద్ధమైన పనిగా భావిస్తారు. వాళ్లంతటవాళ్లు ఇస్తే మాదేముంది ? అమరుస్తాము. కాని అట్లా జరగదు''

విలాసినీదాస్ ఈ మాటలు ప్రతి అక్షరమూ విన్నది. ఆమె తల తిరిగిపోయింది. కళ్లు మసకబారినట్లయ్యాయి. ఒళ్ళు తెలియకుండా పడిపోయింది. నర్సులు చూసి డాక్టరుకు చెప్పారు.

ఒంటిగంటకు డాక్టరు వచ్చిచూస్తే మంచమ్మీద ఆమెలేదు. నర్సును పిలిచి అడిగాడు.

''మేడమ్ పావుగంటకింద ఇంటికి వెళ్తాననిచెప్పి వెళ్ళారు.''

"ఆమె బాగా తేరుకున్నారా ?''

"తనకు బాగానేఉందని మీకు చెప్పమన్నారు''

''మాస్టర్ మోహన్‌దాస్ ఎలా ఉన్నాడు ?''

''పాలు తాగాడు. అంతకుముందు లివర్‌సూప్ ఇచ్చాను.''

"నేను లంచ్‌కి పోతున్నాను. సిస్టర్‌కి చెప్పు"

ఇద్దరూ కారిడార్‌గుండా నడిచారు. డాక్టర్ తన రూమ్‌లోకివెళ్లాడు. నర్సు సిస్టరురూమ్‌లోకి వెళ్ళింది.

విలాసినీదాస్ తన యింటికివెళ్ళి ఇల్లంతా ఒకసారి కలయచూసింది. కింద పెద్ద డైనింగ్‌హాల్లో పెద్దబల్ల దానిచుట్టూ కుర్చీలు. ఈ గోడనుంచి ఆ గోడ వరకూ అద్దాలషోకేసు. దానినిండా అపూర్వమైన వస్తువులు - బొమ్మలు-దశావతారాల కొయ్యబొమ్మలు-విదేశాలనుంచి తెచ్చిన కళాఖండాలు. ఇత్తడితో చేసిన బొమ్మలు. గాజుబొమ్మలు. శ్రీకృష్ణుడు రథమ్మీద కూర్చుని అర్జునుడికి భగవ

ద్దీతను బోధిస్తున్న దృశ్యం-తెల్లటి లోహపురథం. ఒకచోట పాలరాతి తాజ్‌మహల్. ఆ షోకేసంతా రకరకాల వస్తుజాలంతో నిండిఉంది.

మోహన్‌దాస్ ఏదేశము వెళ్ళినా ఏ ప్రదేశమువెళ్ళినా అక్కడినుంచి తన కంటికి అందంగా కనుపించిన వస్తువులను తీసుకువచ్చి ఆ షోకేసులో పెట్టేవాడు. వాటిలో కొన్ని వస్తువులు అతడి అభిరుచిని తెలుపుతాయి. కొన్ని తనయింటికి అలంకారమని సేకరించినవి. మరికొన్ని అతడి స్టేటస్‌కి తగినవి. అతడు తన యింటికివచ్చిన అతిథులకు వాటిని గురించిన వివరాలను విందుకుముందు, అలిసి పోయేవరకు చెప్పేవాడు. స్నేహితులు తేనీటి విందుకువచ్చి వాటినిచూస్తూ కాల క్షేపం చేసేవారు.

మోహన్‌దాసు గొప్ప బిజినెస్‌మాగ్నెట్. అతడు విదేశాలు తిరిగివచ్చాడు. మంచి కళాభిరుచి కలవాడు. అతడి మాటల్లో చమత్కారం కంటె హాస్యపుజల్లు ఎక్కువగా ఉండేది. తన సంభాషణా చాతుర్యంతో వ్యాపారాన్ని వృద్ధిచేసుకుంటూ ఏరిన ముత్యాల్లాంటి పదిమంది స్నేహితులను కూర్చుకున్నాడు.

నిజానికి విలాసిని అతడి ఆర్థికస్థాయికి తగనిది. కాని ఆమె అతడిని తన అందచందాలతో తన మేధస్సంపత్తితో ఆకర్షించింది. తన సోదరుడితో కూడా అప్పుడప్పుడువచ్చి అతడిని తనమాటలతో ఓడించేది.

అట్లా ఆమె అతడి మనసును వశంచేసుకుని అతడికి ఇల్లాలయింది. అతడి తలిదండ్రులకు ఒక ముద్దులకుమార్తె అయింది.

తమ ఏకైక కుమారుడు తండ్రిఅయినాడని తెలుసుకున్నప్పటినుంచీ రతన్‌దాసు దంపతులు సంతోషం పట్టలేక దానాలూ ధర్మాలూ విందులూ చేసి ఆనందించారు. బంధువులతో ఇల్లు కిటకిటలాడిపోయేది.

మన్మోహనదాసు పుట్టినప్పుడు రతన్‌దాసు దంపతులకూ మోహన్‌దాసుకూ ఆనందానికి అవధులులేవు. ఆ వంశానికిబిడ్డ చందమామనిపించాడు. ఇల్లంతా కోలాహలంగా ఉండేది. మోహన్‌దాసు అదృష్టాన్ని గురించి పొగడనివాళ్ళు లేరు.

విలాసినీదాస్‌కు కన్నవారిలా చూసుకున్న అత్తమామలు రెండునెలల తేడాలో పండుటాకుల్లా రాలిపోయారు. మనమడి ముద్దుముచ్చటలు వాళ్ళు చూడ

లేదన్న విచారం కొన్నిరోజులు బాధించింది ఆమెను. బిడ్డను చూసుకుంటూ ఇంటి బాధ్యతలనూ వ్యాపార విషయాలనూ నిర్వహించుకుంటూఉన్న దంపతులకు ఆరునెలలు ఎట్లగడిచాయో తెలియదు-కుటుంబమిత్రుడు రామ్‌సింగ్ విదేశాలనుంచి వచ్చేవరకు.

రామ్‌సింగ్ ఏడాదికొకసారి విదేశాలకువెళ్ళి ఆరునెలలు అక్కడి వ్యాపారాన్ని చూసుకుని తిరిగివస్తాడు. ఈసారి వచ్చినప్పుడు రామ్‌సింగ్ మోహనదాసింట్లో దిగాడు. అతడువస్తే రాత్రీపగలూ భేదంతెలియదు మోహన్‌దాస్‌కి. ఆ సంభాషణలూ, ఆ బ్రిడ్జి ఆటలూ, ఆ వ్యాపార విషయాలూ, ఆ విందులతో కాలం గడిచిపోతుంది అసాధారణంగా. కాని ఈసారి వాళ్ళ ఆనందానికి కేంద్రబిందువు ఆయింటి పసిడిపంట మన్మోహనదాసయ్యాడు.

మిత్రులిద్దరూ కలిసి వ్యాపారలెక్కలూ దానిపెంపుదలా, విదేశాలలోని వ్యాపారంతో పోల్చుకుంటూ కొత్త పథకాలు వేసుకుంటూ ఇంటికి వచ్చేసరికి మన్మోహనదాసు నిద్రపోతూ ఉండేవాడు. ఇద్దరికీ కొంచెం ఆశాభంగమయినట్టుండేది. బిడ్డ కళ్ళుతెరిచినప్పుడు ఆనందంతో తోపుడుబండీలో పడుకోబెట్టి ఇల్లంతా తిప్పుతూఉండేవారు. అలాంటి సందర్భంలో రబ్బరు బొమ్మలా ఉన్న ఆ బిడ్డనుగురించి రామ్‌సింగ్ మనసులో అనుమానం మొలకెత్తింది.

ఆ బిడ్డనవ్వడు. బిడ్డలందరిలాచూడడు. వయసుకు తగిన ఆటలూ మాటలూ లేవు.

ఎందుకని ?

కాని-మోహన్‌దాసు విలాసినులకి సంగతి చెప్పలేక మథనపడుతున్నాడు తనలోతాను.

ఆ మరునాడే ''మోహన్ ! నాతోకూడా విదేశాలనుంచి ఒక మిత్రుడు వచ్చాడు. అతడిని చూసి వస్తాన''ని వెళ్ళి వెంటబెట్టుకొచ్చాడు.

అతడు బిడ్డల వైద్యశాస్త్రంలో నిపుణుడు. బిడ్డను చూడగానే గ్రహించాడు. కాని మోహన్‌దాసుకుగాని అతడి మిత్రుడు రామ్‌సింగ్‌కుగాని ఏమీ చెప్పలేక పోయాడు అందరూ టీ తాగారు దేశవిదేశ కబుర్లు అనేకంగా చెప్పుకున్నారు మాటల సందర్భంలో ఆ దేశాలలోని హాస్పిటల్స్, వైద్య విధానాల గురించి.

మాట్లాడుతూ ఆ డాక్టరన్నాడు ''మోహన్‌దాస్‌జీ మీరు ఒక హాస్పిటల్ నిర్మాణానికి పూనుకోకూడదూ? నేను ప్లాను కావాలంటే పంపుతాను. మీ పరిశ్రమలలో అదొకటనుకోండి. ముఖ్యంగా మనదేశంలో పిల్లలకు వైద్యాలయాలు తక్కువగా ఉన్నాయి. అందులో ఒకభాగం పెద్దవాళ్ళకు కేటాయించండి. వాటిలో ప్రత్యేకమైనవీ ప్రమాదకరమైన వ్యాధులకుమాత్రమే వైద్యంజరిగే ఏర్పాట్లు చేయండి. స్పెషలిస్టులను నేను పంపుతాను. పనిముట్లుకూడా విదేశాలనుంచివచ్చే ఏర్పాటు చేయండి" అన్నాడు.

ఈ సలహా మోహన్‌దాసుకెంతో నచ్చింది. తన పరిశ్రమలలో ఇదొకటి కాకుండా, తనకుకూడా వైద్యాలయాలంటే ఇష్టమే. కనుక ఆ మరునాటినుంచే పేపర్‌వర్కు ప్రారంభం చేశారు పారిశ్రామికవేత్తలు. ప్లానువచ్చింది. కంట్రాక్టరు మంచి ముహూర్తాన బునాదులు ప్రారంభించాడు.

ఒక ఏడాదిలో ఆ డాక్టరు రెండుసార్లు వచ్చి అవసరమైన మార్పులు చేయించాడు. భవనం తయారుకాగానే విద్యుచ్ఛక్తి, నీటి వసతులు డ్రైనేజి, ఆపరేషన్ థియేటరు ఏర్పాట్లూ చురుకుగాసాగాయి. విదేశాలనుండి వస్తుపరికరాలు వచ్చే ఏర్పాట్లు జరిగాయి. ఎక్సురే, స్కానింగ్‌వంటి యంత్రాలకోసం ఆర్డరు చేశారు.

రెండేళ్ళు కాకుండానే డాక్టర్లు, వార్డుబాయిస్, నర్సులు నియమింపబడ్డారు. పెద్దఎత్తున ప్రారంభోత్సవము జరిగింది. తేనీటి విందూ ప్రముఖుల ప్రసంగాలూ జరిగాయి. మరునాటినుంచీ ఒక్కొక్కరే రోగులు చేరటం మొదలుపెట్టారు. కొద్దికాలంలోనే అటువంటి వైద్యాలయం ఎక్కడా లేదనిపించింది.

మోహన్‌దాసు అమితోత్సాహంతో రోజుకొకసారి హాస్పిటల్ భవనమంతా చుట్టివచ్చేవాడు. గేటుదగ్గర నిలబడి ఆ భవనాన్ని చూసుకుని ఆనందించేవాడు. గర్వంగా చూసుకునేవాడు. దాని రాబడికూడా అతడికి సంతృప్తి కలిగించింది.

"మనబాబు లేచినడవడేం ? మాట్లాడడేం ఒక చిన్నమాటయినా ?''

మోహన్‌దాస్ తన మనసులోనే అనుకునేవాడు. విలాసిని కూడా అనుకునేది. కాని-ఒకరితో ఒకరు ఆ సంగతి గురించి మాట్లాడుకునేవారుకారు. దేహం

పెరుగుతున్నదిగాని మెదడు పని చేయటంలేదన్న అనుమానం రాలేదు. డాక్టర్లకి చూపిస్తే ఏదోఒకటి చెప్పి బిడ్డనేంచేస్తారోనన్న భయం ఇద్దరినీ పీడిస్తూ ఉండేది.

హఠాత్తుగా ఒకరాత్రి మోహన్‌దాస్‌కి గుండెపోటు వచ్చింది. తెల్లవారేసరికి ప్రాణం పోయింది. గుండెపోటు వచ్చినవెంటనే అతడు తన ఆస్తి భవనాలూ వైద్యాలయం అంతా విలాసినిపేరరాసి ఆమె తరువాత మన్మోహన్‌దాసుకు చెందేటట్టుగా చేశాడు.

మోహన్‌దాసు చనిపోయిన తరువాత విలాసిని బిడ్డతో ఆయింట్లో ఉండలేకపోయింది. తామిద్దరూ ఆనందంగా గడిపిన ఆ పెద్దభవనంలో ఒక్కతే తిరగలేకపోయింది. ఒంటరితనం బాధించసాగింది. హాస్పిటల్లో ఉన్న ఫామిలీ సూట్ ఒకటి చివరగా ఉన్నదానిలోకి బిడ్డతోకూడా మారింది.

కాని ఆయింటికి వారానికొకసారి వెళ్ళి, మోహన్‌దాసు ఫోటోలనూ, అతడు అపురూపంగా సేకరించిన వస్తుజాలాన్నీ, అతడు పెంచిన తోటనూ చూసి, కొంతసేపు అక్కడ కూర్చుని, గడిచిన జీవితాన్ని తలుచుకుని కన్నీరు కార్చి తనకుతానే ఉపశమనం కావించుకుని తిరిగివచ్చేది.

కాని-ఆనాడు ఆమె ఇంటికి మామూలుగా రాలేదు. వస్తూనే ఇల్లంతా కాలు కాలిన పిల్లిలా కలయ తిరిగింది. ఫొటోల కన్నిటికీ పూలహారాలు వేసి నమస్కరించింది. మన్మోహనదాసు పుట్టినప్పుడు తీసిన ఫోటోలన్నిటినీ చూసి వాటి ముందర కూలబడిపోయింది.

పెద్ద పారిశ్రామికవేత్త అయిన మోహన్‌దాసు ఆస్తికంతకూ ఏకైక వారసుడు-ఆ దంపతుల జీవితాలకు చందమామ అని తలపోసిన మన్మోహనదాసు జీవితమంతేనా? అతడు తన చక్రాలలాంటి కళ్ళతో కన్నతల్లిని చూడలేడా? నోరారా అమ్మా అని పిలవలేడా? తనెంత దురదృష్టవంతురాలు?

ఆ బిడ్డ-తనభర్త సేకరించి షోకేసులో అమర్చిన అపురూపశిల్పంలా ఉండిపోతాడా?

తను ఎటువంటి బిడ్డనుకన్నది?

మరుక్షణమే తనను తాను నిందించుకున్నది. ఆ బిడ్డనుగురించి తననోటి నుంచి ఎటువంటిమాట వెలువడ్డది?

తను భరించలేనిదా ఊహ.

కడుపు చెరువై పోతున్నది.

కాని అనుకున్నపని చేయాలంటే తనమనసును అదుపులో పెట్టుకోవాలి.

గబగబా మేడమీదికి వెళ్ళింది. మోహన్‌దాసు ఆఫీసు రూంలో బల్లదగ్గర కూర్చుని డాక్టరికి ఉత్తరం రాసింది.

డాక్టరుగారికి-

నాబిడ్డకోసం ఇంతకాలం బ్రతికాను. కాని-మీనోటివెంట బిడ్డనుగురించి వెలువడిన మాటలువిన్నాను. ఇంతకాలం నేను ఆశతో బ్రతికాను. నా ఆశలు అడియాశలని తెలుసుకున్న తరువాత ఈ శరీరాన్ని పరోపకారంకోసం దానం చేయాలనుకున్నాను. నా అవయవాలలో పనికివచ్చేవన్నీ తీసి అవసరమైనవారికి అమర్చండి. నా బిడ్డసంగతి ఈ చేతులతో రాయలేను. మీకు ఉచితమని తోచి నట్టు చేయండి. తండ్రి ఆస్తికంతకూ ఆ బిడ్డ ఏకైక వారసుడు. ఆ బిడ్డఆస్తి అంతా అటువంటి దీనులకోసం ఖర్చుచేయండి.

మీరు-నేను చనిపోయిన తరువాతనే నా బిడ్డనుగురించి ఆలోచించండి. నా ప్రాణంఉండగా నేను మాటమాత్రం సహించలేను. నేను ఉన్నంతవరకూ బంగారుబొమ్మలా ఆ పడకమీద ఉండనీయండి. ఆ సంతృప్తితో నన్నుకన్ను మూయనివ్వండి.

ఈ ఉత్తరం కాపీలు ట్రస్టుబోర్డు మెంబర్లకు పంపండి.

ఉదయం 6 గంటలకు మోహన్‌దాసు భవనంనుండి నా శరీరాన్ని తీసుకు వెళ్ళండి.

మోహన్‌దాసుగారి ఆస్తీ మోహన్‌దాసుగారి భార్యాబిడ్డల అవయవాలూ వారు నిర్మించిన వైద్యాలయంలోని రోగులకు ఉపయోగించి మమ్మల్ని కృతార్థు లను చేయండి,

ఇట్లు
విలాసినీ మోహన్‌దాసు.

ఉత్తరం ముగించి ఆ రాత్రి వాచ్‌మన్ చేతికిచ్చి పంపింది. గుప్పెడు నిద్రమాత్రలు నోట్లోవేసుకుని గ్లాసెడు మంచినీళ్ళు తాగింది.

ఇల్లంతా మరొకసారి కలయతిరిగి, బిడ్డనెత్తుకుని మోహన్‌దాసు పక్కన కూర్చుని తీయించుకున్న ఫొటో గుండెలకదుముకుని మంచమ్మీద పడుకుంది.

ఇల్లంతా గిరగిర తిరుగుతున్నట్లనిపిస్తోందామెకు. మోహన్‌దాసుతో బిడ్డను గురించిన ఆటపాటలను వర్ణించిచెప్పి ఆనందిస్తున్నట్లనిపిస్తోంది. మోహన్‌దాసు ముఖంలో ఎంత ఆనందం ! అతడు అంత సంతోషంగా ఉండగా ఎన్నాళ్ళకు తనుచూడగలిగింది ?

ఇప్పుడు మనసుకెంతహాయిగా ఆనందంగా ఉంది ?

ఇదేచాలు-ఇదిచాలు-చాలు-ఈ జీవితానికి.

ఆమెకళ్ళు మూతలుపడ్డాయి.